ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

3
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
సోమవారం 16 సెప్టెంబరు 2024


ములుగు సమీపంలోని తోపుకుంట వద్ద నిమజ్జనం కోసం ఏర్పాట్లు చేస్తున్న పంచాయతీ అధికారులు


వినాయక నిమజ్జనం జరగనున్న కాళేశ్వరం గోదావరి ప్రదేశం

# సర్వం సిద్ధం

- నేడు గణపతి నిమజ్జనోత్సవం
- ముగుస్తున్న నవరాత్రి ఉత్సవాలు
- భూపాలపల్లి జిల్లాలో కాళేశ్వరం, గణప సముద్రానికి తరలివెళ్లనున్న గణనాథులు
- ఏర్పాట్లలో నిమగ్నమైన ఉత్సవ కమిటీలు, జిల్లా యంత్రాగం

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 15: గణపతి నవరాత్రోత్సవాలు ముగియనున్నాయి. గ్రామ గ్రామాన వెలిసిన గణపతి ప్రతిమలు నిమజ్జనానికి సిద్ధమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా వినాయక మండపాల నిర్వాహక కమిటీలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. ముఖ్యంగా జిల్లాలోని మహదేవపూర్ మండలం కాళేశ్వరం గోదావరి వద్ద, గణపురం మండలం గణపసముద్రం చెరువులో విఘ్నేశ్వరుడిని సోమవారం నిమజ్జనం చేయనున్నారు. భూపాలపల్లి పట్టణం నుంచే కాకుండా గణపురం, రేగొండ, మల్హర్, మహాముత్తారం, మహదేవపూర్, కాటారం మండలాల భక్తులు కాళేశ్వరంలోని గోదావరి నదికి వినాయకుడిని తరలిస్తారు. గణపురం మండలంలోని వారు పలువురు గణపసముద్రం చెరువుకు తీసుకెళ్తారు. మొగుళ్లపల్లి, మల్హర్ మండలంలోని భక్తులు స్థానికంగా ఉన్న చెరువులు, మానేరులో నిమజ్జనం చేస్తారు. ఇందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.

### జిల్లాలో 1400 విగ్రహాలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 12 మండలాలు ఉండగా 249 గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాలు, పట్టణంలోని వివిధ కాలనీల్లో మొత్తం సుమారు 1400 విగ్రహాలను కొలువుదీర్చారు. అయితే.. ఆన్‌లైన్‌లో నమోదైన వివరాల ప్రకారం 900 విగ్రహాలే ఉన్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీటి లెక్కలు తేల్చేందుకు ఒకవైపు విద్యుత్‌శాఖ కసరత్తు చేయగా, మరోవైపు పోలీసులు కూడా చేశారు. అయినప్పటికీ వీరంతా పెద్దగా జరిపే మండపాలను మాత్రమే లెక్కించగా మిగతావి గల్లీ గల్లీకో విగ్రహాన్ని ఏర్పాటు చేసినవే ఉన్నాయి. భూపాలపల్లి పట్టణంలో 138 విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయినప్పటికీ గత ఏడాదితో పోలిస్తే ఈసారి తక్కువేనని తెలుస్తోంది.

### రెండు స్టేజీల ఏర్పాటు

భూపాలపల్లి పట్టణంలో గణపతి మండప కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించేందుకు రెండు స్టేజీలను (వేదిక) ఏర్పాటు చేశారు. బీజేపీ అనుబంధ విశ్వ హిందూ పరిషత్, ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో ఒకటి, వ్యాపార వాణిజ్య రంగాలకు చెందిన వారితోపాటు కాంగ్రెస్ నాయకులు ధర్మ వాహిని గణేష్



ఉత్సవ కమిటీ ద్వారా ఏర్పాటు చేసి మరో స్టేజీని ఏర్పాటు చేశారు. ఈ స్టేజీలపై వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి వచ్చిన గణపతి మండపాల నాయకులను ఆహ్వానించి శాలువాతో సత్కరించి సాదారంగా నిమజ్జనానికి సాగనంపుతారు.

### మారుమోగుతున్న పరిసరాలు

గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరుగుతాయి. పల్లెపల్లెనా, పట్టణాల్లో కొలువుదీరిన గణపతుల మండపాల వద్ద డీజేలు ఏర్పాటు చేసి మహిళలు, పురుషులు, చిన్నాపెద్దా అంతా కలిసి ఆటపాటలతో విఘ్నేశ్వరుడిని సాగనంపనున్నారు.

## నిమజ్జనంలో నిర్లక్ష్యం వహించొద్దు

- భూపాలపల్లిత కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 15: గణేష్ నిమజ్జనంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో ఆయన ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. భక్తులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ నిమజ్జనుత్సవాన్ని ఆనందంగా ముగించేలా ఆయా శాఖల అధికారులు, పోలీసులు కృషి చేయాలన్నారు. జిల్లా నుంచే కాకుండా వరంగల్, ములుగు జిల్లాల నుంచి వచ్చే విగ్రహాలు నిమజ్జనికి కాళేశ్వరానికి వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా కాళేశ్వరం గోదావరి పుష్కఘాట్ వద్ద పటిష్ఠ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నిర్దేశించిన ప్రాంతాల్లోనే వినాయకులను నిమజ్జనం చేసేలా యంత్రాంగం పర్యవేక్షించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జన వేడుకలు జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా చూడాలన్నారు.

## నిమజ్జనోత్సవానికి పటిష్ఠ భద్రత

- విధుల్లో పాల్గొననున్న 300 మంది పోలీసులు
- ఎస్పీ నేతృత్వంలో భారీ బందోబస్తు
- అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చర్యలు

6

## గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు

- ములుగు జిల్లాలో ఏడుచోట్ల లైటింగ్, క్రెయిన్లు
- గజ ఈతగాళ్లు.. పోలీసుల బందోబస్తు

ములుగు, సెప్టెంబరు 15: గణపతి నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో పరిపూర్ణమవుతున్నాయి. ఈ క్రమంలో వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి జిల్లావ్యాప్తంగా 1,500కు పైగా విగ్రహాలు కొలుదీరినట్టు అంచనా. అన్ని ఉత్సవ కమిటీలు, మండపాల వివరాలను ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో సేకరించి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు సూచనలు చేశారు. వేడుకలు వైభవంగా పూర్తవుతున్న నేపథ్యంలో నిమజ్జనోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో జరిపించేందుకు సమాయత్తమవుతున్నారు. జిల్లాలో ఏడుచోట్ల అధికారికంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాకేంద్రం సమీపంలోని తోపుకుంట, గోవిందరావుపేట మండలం చల్వాయి పంచాయతీ పరిధి గౌరారం చెరువు, తాడ్వాయి మండలం గంగారం పంచాయతీ పరిధి అన్నవరం చెరువు, మేడారం పంచాయతీ పరిధి జంపన్నవాగు, ఏటూరునాగారం మండలం ముళ్లకట్ట వంతెన, వెంకటాపూర్ మండలంలోని జవహర్‌నగర్ చెరువు, కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమ్మక్క బ్యారేజీ, వాజేడు మండలం గోదావరి ముల్లకట్ట బ్రిడ్జి, వెంకటాపురం(నూగూరు) మండలం బొల్లకట్టు వాగు, పేరూరు గోదావరి ఫెర్రీ పాయింట్ వద్ద సౌకర్యాలు కల్పిస్తున్నారు. మంగపేట మండలంలోని విగ్రహాలను ముల్లకట్ట వద్ద గోదావరిలో నిమజ్జనం చేయాలని పోలీసులు ఉత్సవ కమిటీలకు సూచించారు. లైటింగ్‌తోపాటు జేసీబీలు, క్రెయిన్లను అందుబాటులో ఉంచుతున్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా జనరేటర్లను కూడా సమకూర్చుతున్నారు. ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రతీ ప్రదేశంలో ఐదుగురికి తగ్గకుండా గజ ఈతగాళ్లను నియమించారు. ఇదే క్రమంలో 500మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నారు. డీఎస్పీ, సీఐ, ఎస్సై స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారు. ఇదే క్రమంలో జిల్లాలోని 174 గ్రామపంచాయతీల పరిధిలో ఏటా నిమజ్జనం జరిగే చెరువులు, కుంటల వద్ద పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. డీపీవో ఆదేశాలతో పరిసరాలను చదును చేయించడంతోపాటు విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు వీలుగా సదుపాయాలు కల్పిస్తున్నారు.

### సీసీ కెమెరాల ఏర్పాటు : శబరీశ్, ఎస్పీ

వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి. నిమజ్జనం కోసం ఏర్పాట్లు చేసిన ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటుచేస్తున్నాం. శోభాయాత్రల సమయంలో భక్తులు ఆధ్యాత్మికతతో, సంయమనంతో మసులుకోవాలి. డీజేలకు ఎటువంటి అనుమతి లేదని గమనించాలి. విధినిర్వహణలో జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి అప్రమత్తత, సన్నద్ధతతో ఉంది.

## మతిస్థిమితంలేని వ్యక్తి చేతిలో ఒకరి మృతి


భిక్షపతి (ఫైల్)

తాడ్వాయి, సెప్టెంబరు 15: మతిస్థితిమితం లేని వ్యక్తి చేతిలో ఒకరు మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దామెరవాయి గ్రామానికి చెందిన మోరె ఎర్ర భిక్షపతి(48) ఆదివారం ఉదయం తన వ్యక్తిగత పనిమీద దామెరవాయి నుంచి ద్విచక్రవాహనంపై కాటాపూర్ వెళ్తున్నాడు. ఈక్రమంలో మార్గమధ్యలోని ఇటుకబట్టీల సమీపంలో మతిస్థిమితంలేని వ్యక్తి(పిచ్చివాడు) ఒక్కసారిగా ద్విచక్రవాహనానికి ఎదురుగా వచ్చి కర్రతో భిక్షపతిని మోదాడు. దీంతో ఆయన కిందపడిపోవడంతో మరోదెబ్బ కొట్టి ఇటుకబట్టీల వైపు వెళ్లాడు. ఇది గమనించిన చుట్టుపక్కలవారు 108 వాహనానికి సమాచారం అందించి భిక్షపతిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలోనే భిక్షపతి మృతి చెందాడు. మతిస్థిమితం లేని వ్యక్తిని గ్రామస్థులు అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. మృతుడికి భార్య కుమారితోపాటు కుమారులు ప్రణయ్, ప్రశాంత్ ఉన్నారు. వ్యవసాయ పనులు చేసుకుంటూ భిక్షపతి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మతిస్థిమితంలేని వ్యక్తి బీహార్‌కు చెందినవాడని, అతడిని పలుమార్లు పోలీసులు తీసుకెళ్లి క్షౌవరం చేయించి నూతన వస్త్రాలు ధరించి పంపించారని గ్రామస్థులు తెలిపారు.

## అఘాయిత్యాలకు అడ్డుకట్టవేయండి

- నిందితుడిని కఠినంగా శిక్షించండి
- మహిళపై లైంగిక దాడిపై గ్రామస్థుల ఆందోళన
- యువకుడిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా
- నిందితుడి అన్నదమ్ములు సహా తండ్రి ఆగడాలపై ఆగ్రహం


పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పెరుకపల్లి గ్రామస్థులు

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 15: మహిళపై లైంగికదాడికి పాల్పడిన యువకుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం ధర్నా చేశారు. ఈ నిరసన రెండుగంటలపాటు కొనసాగింది. దీంతో ములుగు డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని గ్రామస్థులను శాంతింపజేసేందుకు యత్నించారు. వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భూపాలపల్లి జిల్లా పెద్దాపూర్ గ్రామశివారు పెరుకపల్లిలో గురువారం అర్ధరాత్రి 60 ఏళ్ల మహిళపై ఇదే గ్రామానికి చెందిన యువకుడు మాదం శివకుమార్ అత్యాచారం చేశాడు. శుక్రవారం ఉదయం బాధితురాలు వెంకటాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో నిందితుడిపై కఠిన సెక్షన్లు విధించాలని డిమాండ్‌తో గ్రామస్థులంతా ఆదివారం వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. నిందితుడి ఇద్దరు అన్నదమ్ములు సహా తండ్రి కూడా ఇదేరకంగా గ్రామంలోని మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆందోళనకు దిగారు. వారిని ఎవరైనా ఎదురించినా, పోలీసులకు సాక్ష్యం చెప్పినా వారి వ్యవసాయ బావి వద్ద ఉన్న మోటార్లను ఎత్తుకెళ్లడం, ఇంట్లోని మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం లాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని గ్రామస్థులు పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు ఆ కుటుంబంలోని పురుషుల వల్ల గ్రామంలో అశాంతి నెలకొంటోందని కన్నీటిపర్యంతమయ్యారు. వారి ఆగడాలు భరించలేక గ్రామమంతా ఒక్కతాటిపైకి వచ్చామని స్పష్టం చేశారు. మహిళలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు.

నిందితుడిపై పీడీయాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా మాదం శివకుమార్ అనే యువకుడు గ్రామంలోని అనేకమంది మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని, అతడి ఆగడాలు తట్టుకోలేక ఆందోళనకు దిగామని గ్రామస్థులు తెలిపారు. ఇదిలా ఉండగా బాధితురాలు ములుగు జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయానికి వెళ్లేం దుకు ప్రయత్నించగా స్థానిక పోలీసులు అడ్డుకున్నారు. డీఎస్పీ రవీందర్ హామీతో గ్రామస్థులు ఆందోళనను విరమించారు.

## కొండగొర్రెపిల్లను స్వాధీనం చేసుకున్న అటవీ శాఖ అధికారులు


కొండగొర్రెపిల్లతో అధికారులు

గోవిందరావుపేట, సెప్టెంబరు 15: మండలం లోని లక్నవరం అటవీప్రాంతంలో గొర్రెలమందలోకి వచ్చిన కొండగొర్రెపిల్లను అటవీ శాఖ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. పస్రా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ టీ.దీప్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్నవరం అటవీప్రాంతంలో గొర్రెలకాపరి ఈనెల 12న గొర్రెలను మేపుతున్న క్రమంలో కొండగొర్రెపిల్ల మందలో కలిసి వచ్చింది. రెండురోజుల తర్వాత గమనించిన గొర్రెలకాపరి కొండగొర్రె పిల్లగా గుర్తించి తమకు సమాచారం అందించినట్లు తెలిపారు. దీంతో కొండగొర్రెపిల్లను స్వాధీనం చేసుకుని హనుమకొం డలోని జూపార్కుకు అప్పగించినట్లు రేంజ్ ఆఫీసర్ వెల్లడించారు. ఆయన వెంట ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎం.వేణుగోపాల్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బి.అర్జున్, సిబ్బంది ఉన్నారు.

### మేడిగడ్డ బ్యారేజీలోకి 3.84 లక్షల క్యూసెక్కులు

మహదేవపూర్ రూరల్, సెప్టంబరు 15 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం బ్యారేజీలోకి 3.84లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద 5.10మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతోంది.

## భార్యను చంపాననే పశ్చాత్తాపం

- మనోవేదనతో భర్త ఆత్మహత్య


రమణాచారి (ఫైల్)

కాటారం, సెప్టెంబరు 15: భార్యతో గొడవపడ్డాడు అతడు. క్షణికావేశంలో ఆమెను హత్య చేశాడు. పది నెలల జైలు జీవితం గడిపి విడుదలైన ఆ వ్యక్తి భార్యను చంపాననే పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు. చివరికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. కాటారం ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మండలంలోని వేశాలపల్లి గ్రామానికి చెందిన ఎలకంటి రమణాచారి(40) వడ్రంగి పనిచేస్తూ భార్య రమ, కొడుకు విశ్వతో కలిసి జీవించే వాడు. గత ఏడాది ఏప్రిల్‌లో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో భార్యను రమణాచారి హత్య చేశాడు. ఈ కేసులో పది నెలల జైలు జీవితం గడిపి విడు దలయ్యాడు. భార్యను అనవసరంగా చంపాననే పశ్చాత్తాపం అతడిని వెంటాడింది. ఈ క్రమంలోనే నాలుగు నెలల క్రితం బంధువుల సాయంతో కాటారంలోని చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులు చేస్తున్న మెగా కంపెనీ మెస్‌లో వంట సహాయకుడిగా చేరాడు. క్షణికావేశంలో భార్యను చంపడాన్ని తలుచుకుంటూ మనస్తాపానికి గురైన రమణాచారి ఆదివారం తెల్లవారుజామున తాను పనిచేసే మెస్ సమీపంలోని షెడ్డు పైక ప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం తోటి సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి ఆగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

## బీమా.. ధీమా

- నారీమణులకు భరోసా కల్పిస్తున్న సర్కారు
- రుణ బీమా, ప్రమాద బీమాకు శ్రీకారం
- భూపాలపలల్లి జిల్లాలో 84,723 స్వయం సహాయక సభ్యులకు ప్రయోజనం


సమావేశం నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 15: నారీమణులకు సర్కారు భరోసా కల్పిస్తోంది. మహిళాశక్తి పేరుతో ప్రత్యేక రుణాలకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం బీమా పథకాలను సైతం అమల్లోకి తెచ్చింది. ఉచితంగా రుణబీమా, ప్రమాదబీమా పేరుతో రెండురకాల ప్రయోజనం కల్పిస్తోంది. అప్పు తీసుకున్న మహిళ ఏదైనా ప్రమాదవశాత్తు మరణిస్తే రుణమాఫీతోపాటు ప్రమాదబీమా ద్వారా ఆమె కుటుంబానికి ఆర్థికసాయం అందనుంది. మార్చిలోనే రుణబీమా ప్రకటించగా తాజాగా ప్రమాద బీమాకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసింది.

భూపాలపల్లి జిల్లావ్యాప్తంగా 11మండలాల్లో 8053 స్వయం సహాయక సంఘాలు, 364మంది వీవోఏలు, 84,723 మంది సభ్యులు ఉన్నారు. వారు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి, చిరువ్యాపారాలు చేసుకోవడానికి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, సీఐఎఫ్,


సభ్యులతో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

మహిళాశక్తి పథకాల ద్వారా వివిధ రకాల రుణాలను ప్రభుత్వం అందిస్తోంది. ఇదే క్రమంలో రుణమాఫీ, ప్రమాద బీమాకు కూడా శ్రీకారం చుట్టింది.

### ప్రమాదబీమా రూ.10లక్షలు

పొదుపు సంఘాల మహిళలు ప్రమాదవశాత్తు మృతిచెందితే అలాంటి వారి కుటుంబాలకు రూ.10 లక్షలు ఉచిత బీమా వర్తింపజేయనున్నారు. వంద శాతం వైకల్యం కలిగి ఉన్నట్లయితే రూ.10లక్షలు అందిస్తారు. 50శాతం వైకల్యం కలిగితే రూ.5లక్షలు చెల్లిస్తారు. మృతిచెందిన మహిళలకు పొదుపు, అప్పు ఉంటే అది కూడా మాఫీ చేస్తారు. గాయాలైన మహిళ అంగవైకల్యం తెలుపు తూ సదరం ధ్రువపత్రం సమర్పించాల్సి ఉంటుంది. మరణించిన వారి పోస్టుమార్టం నివేదిక, పోలీసుల దర్యాప్తు నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. 18 నుంచి 60ఏళ్ల వయసు పొదుపు మహిళలకు ఇది వర్తిస్తుంది.


### రుణబీమా రూ.2లక్షలు

గ్రూపుగా ఒక సంఘానికి రూ.5నుంచి రూ.20లక్షల వరకు బ్యాంకు లింకేజీ ద్వారా ప్రస్తుతం రుణాలు అందిస్తున్నారు. రుణం పొందిన మహిళలు

మిగతా 6వ పేజీలో..

### మహిళలకు ఎంతో ప్రయోజనం


- రవివర్మ, ఏపీఎం (మొగుళ్లపల్లి)



మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు ఈరెండు రకాల పథకాల బీమా సౌకర్యం కల్పించడం వల్ల మహిళల కుటుంబాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. దీనిపై మహిళా సంఘాలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

### ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

- కె.సునంద, భరతమాత సంఘం కోశాధికారి (మొగుళ్లపల్లి)



రాష్ట్ర ప్రభుత్వం మహిళాశక్తి పథకం ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రెండురకాల బీమా సౌకర్యాలను కల్పించడం హర్షణీయం. ప్రభుత్వం మహిళలకు రుణాలను అందజేస్తూ ఆర్థికంగా ఎదగడానికి ఎంతో ఉపయోగపడుతుంది.

## 18న పెద్దల పండుగ జరుపుకోవాలి

కొత్తగూడ, సెప్టెంబరు 15 : ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల్లో భాగంగా ప్రతీ సంవత్సరం జరుపుకునే పెద్దల పండుగను ఈనెల 18న కొత్తగూడ, గంగారం మండలాల్లోని ఆదివాసీలు నిర్వహించుకోవాలని దొరపటేళ్ల సంఘం ఉమ్మడి కొత్తగూడ మండల అధ్యక్షుడు భీరబోయిన సమ్మయ్య పిలుపునిచ్చారు. కొత్తగూడలో ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడారు. అనాదిగా ఆదివాసీలు జరుపుకుంటున్న పెద్దల పండుగను ప్రతీ సంవత్సరం ఉత్తర కార్తీలోని మొదటి పాదంలో వచ్చే మొదటి బుధవారం నిర్వహించుకుంటామని పేర్కొన్నారు. ఈ సంవత్సరం కూడా ఆదివాసీలు సంప్రదాయకరంగా పెద్దల పండుగను జరుపుకోవాలన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎట్టి సర్వయ్య, కోశాధికారి కల్తి వెంకటేశ్వర్లు, మల్లెల రాంబాబు, ఈక నరేష్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సంఘం నాయకులు

## మెడికల్ కళాశాలను అభివృద్ధి చేయాలి

**▸▸ నర్సంపేట సివిల్ ఆస్పత్రిని నెక్కొండకు తరలించాలి ▸▸ సీఎంకు మాజీ ఎమ్మెల్యే పెద్ది లేఖ**

నర్సంపేట, సెప్టెంబరు 15 : నర్సంపేట పట్టణ శివారులోని మెడికల్ కళాశాలను మరింత అభివృద్ధి చేయాలని, నర్సంపేట నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించాలని బీఆర్ఎస్ నేత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ పంపారు. జిల్లా స్థాయి ఆస్పత్రి ఏర్పాటు అవుతున్నందున నర్సంపేటలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిని గిరిజన ప్రాంతమైన నెక్కొండకు తరలిస్తే మండలంలోని ప్రజలు, గిరిజనులకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. దుగ్గొండిలోని పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. అలాగే నర్సంపేటలో మెడికల్ కళాశాల కోసం విరాళంగా భూమిని అందించిన పారిశ్రామికవేత్త దొడ్డ మోహన్‌రావును కళాశాల ప్రారంభోత్సవానికి ఆహ్వానించాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన రైతు కుటుంబాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలన్నారు.

ఇప్పటికే రూ.100 కోట్లతో అన్ని వసతులతో ఆస్పత్రి భవన నిర్మాణం, 50 అడ్మిషన్లతో అన్ని వసతులతో కళాశాల భవన నిర్మాణం పూర్తయిందన్నారు. మెడికల్ కళాశాలలో భవిష్‌త్‌లో 150 అడ్మిషన్లను పెంచుకునే అవకాశం ఉందన్నారు. పీజీ కళాశాల మంజూరు కావాల్సి ఉందని, నర్సింగ్ కళాశాల మంజూరయిందన్నారు. నర్సింగ్ కళాశాలకు శాశ్వత భవనం, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, సహాయ సిబ్బందికి సంబంధించి రెసిడెన్సియల్ భవనాలు, రెసిడెన్సియల్ హాస్టల్ ల్యాబ్స్ ఇతర వసతు కొరకు జీవో 83 ద్వారా మరో రూ.183 కోట్లు మంజూరై ఉన్నాయన్నారు. నిర్మాణంలో ఉన్న పనులు కాకుండా కొత్తపనులకు టెండర్లు పిలవాల్సిన అవసరం ఉందని సీఎంకు పంపిన లేఖలో సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

నియోజకవర్గంలో 53 పల్లె దవాఖానాలు బీఆర్ఎస్ హయాంలో మంజూరయ్యాయని, అందులో 29 దవాఖానాలు పూర్తయ్యాయని, మిగిలినవి పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని సీఎంను కోరారు. జాతీయ స్థాయి విద్యా సంస్థ అయిన మెడికల్ కళాశాల భవన ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి రావటం గౌరవప్రదంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారని ఆయన అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి పంపిన లేఖ ప్రతులను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర నర్సింహ, రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి పంపానని ఆయన పేర్కొన్నారు.

## కారు డ్రైవర్ ఇంట్లో చోరీ

హసన్‌పర్తి, సెప్టెంబరు 15: మండల కేంద్రంలోని కారు డ్రైవర్ ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి రూ.10వేల నగదు, రూ.90వేల విలువైన బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు కథనం ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన వెల్మ రాజేందర్ కారుడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 12న రాజేందర్ అతడి భార్య సుజాత, కూతురు హిరకలు వేములవాడ దేవస్థానానికి మొక్కులు తీర్చుకునేందుకు వెళ్లారు. రాజేందర్ కుటుంబసభ్యులు తిరిగి ఈ నెల 14న రాత్రి ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు తొలగించి ఉన్నట్లు గుర్తించి ఇంట్లోకి వెళ్లి బీరువా తెరిచి చూడగా అందులో దాచి పెట్టిన తులం బంగారు గొలుసు, 5 గ్రాముల బంగారు కమలు, మాటీలు, 5 బంగారు ముక్కలు, రూ.10వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. బాధితుడు రాజేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం కానిస్టేబుల్ క్రాంతికుమార్ ఘటనాస్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ చేరాలు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పింగిళి శ్రీపాల్‌రెడ్డి

## వేసవి సెలవుల్లో పదోన్నతులు ఇప్పిస్తాం..

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను సాధించి ఉపాధ్యాయులకు వేసవిసెలవుల్లో పదోన్నతులు ఇప్పిస్తామని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని ఒప్పించి ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిసామనే ధీమాను వ్యక్తం చేశారు. జీవోనెం. 11, 12లను సవరించి అన్ని కేటగిరీల ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇప్పిస్తామన్నారు. బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీలకు పీఎస్‌హెచ్‌ఎంల ప్రమోషన్లు ఇప్పిస్తామన్నారు. కేజీబీవీ, సమగ్ర శిక్ష విభాగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ టైం స్కేలు ఇప్పిస్తామని హామి ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు పీఆర్టీయూ ముందుంటుందన్నారు. అన్ని యాజమాన్య గురుకులాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను త్వరలోనే పరిష్కరింప జేస్తామన్నారు. అనంతరం హనుమకొండ జిల్లాకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మండల తిరుపతిరెడ్డి, ప్రధానకార్యదర్శిగా పలీత శ్రీహరి, అసోసియేట్ అధ్యక్షులుగా డి.కోమల్‌రెడ్డి, కె.దయాకర్‌రెడ్డి, మహిళా అసోసియేట్ అధ్యక్షులుగా వి.వాణి, ఉపాధ్యక్షులుగా ఎ.మహిపాల్‌రెడ్డి, వి.రామాంజనేయులు, కె.రాజేం దర్ రెడ్డి, జి.విష్ణుమూర్తి, ఎం.సురేందర్, మహిళా ఉపాధ్యక్షులుగా పి.సరస్వతి, కార్యదర్శులుగా బి.మురళీధర్, బి.శరత్‌గౌడ్, ఎల్.గణపతినాయక్, కె.రమేష్‌బాబు, మహిళా కార్యదర్శిగా నికత్ సుల్తానాలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు సాధించిన గౌరిశెట్టి రాజన్న, జిల్లా స్థాయిలో సత్కారం పొందిన అనురాధను సత్కరించారు. సంఘ నాయకులు శ్రీనివాస్, ఉమామహేశ్వర్, పట్టాభి, సుమ, అనురాధ, సంధ్యారాణి పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో రైల్వే ఉద్యోగి ఆత్మహత్య


విజయ్ (ఫైల్)

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 15 : కేసముద్రం మండలం ఇంటికన్నెకు చెందిన రైల్వే ట్రాక్‌మెంటినర్ కాడబోయిన విజయ్ (35) గుండెజబ్బుతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు. ఈనెల 12న ఇంటి వద్ద క్రిమిసంహారకమందు తాగగా కుటుంబసభ్యులు ఆయన్ను మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య మణి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు. విజయ్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

### ఉరి వేసుకుని యువకుడు..

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా) : ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన డోర్నకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్నెగూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం. మన్నెగూడెంకు చెందిన పాతలోతు వినేష్ (23)కు ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం బర్లగూడెంకు చెందిన కరుణశ్రీతో ఐదునెలల క్రితం వివాహం జరిగింది. వినేష్ తండ్రి బాలు మన్నెగూడెంలో ఓ చర్చి పాస్టర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 11న దంపతులిద్దరూ బర్లగూడెంలోని కరుణశ్రీ తల్లిగారింటికి వెళ్లారు. అక్కడ్నుంచి వినేష్ ఒక్కడు మాత్రమే మన్నెగూడెంలోని ఇంటికి వచ్చాడు. వినేష్ తండ్రి బాలు అనారోగ్యంతో ఉండడంతో ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం చర్చిని శుభ్రం చేసేందుకు పనిమనిషి వచ్చారు. ఆమె తలుపులు కొట్టగా ఎవరూ తీయలేదు. దీంతో అనుమానం వచ్చిన ఆమె కిటికిలో నుంచి చూడగా వినేష్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కనిపించాడు. వెంటనే ఈ విషయాన్ని వినేష్ తండ్రికి సమాచారం అందించారు. వినేష్ తండ్రి బాలు మన్నెగూడెంకు చెరుకుని విఘతజీవిగా ఉన్న కొడుకును చూపి కన్నీటి పర్యంతమయ్యాడు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా, తన కొడుకు మృతిపై తనకు అనుమానం ఉందని వినేష్ తండ్రి బాలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

హసన్‌పర్తి, సెప్టెంబరు 15: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెగడపల్లికి చెందిన దామెర ఎల్లయ్యకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు శ్రావణ్‌కుమార్ (23) ఈ నెల 14న ద్విచక్ర వాహనంపై బయటికి వెళ్లి తిరిగి రాత్రి వరకు ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ అయ్యింది. 15న ఉదయం వంగపహాడ్-ఆరెపల్లి ఔటర్‌రింగ్‌రోడ్ మధ్యలో రోడ్డుప్రమాదంలో చనిపోయినట్లు ఫోన్ సమాచారం రావడంతో వెళ్లి చూసేసరికి ద్విచక్రవాహనం రోడ్డు ప్రక్కనే విద్యుత్ స్తంభానికి ఢీకొని శ్రావణ్‌కుమార్ చనిపోయినట్లు గుర్తించారు. మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు తెలిపారు.

## గంజాయి పట్టివేత

కాజీపేట, సెప్టెంబరు 15: పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఓవ్యక్తి వద్ద గంజాయి లభ్యమైంది. కాజీపేట ఎస్సై వి.లవన్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట రైల్వే ఆస్పత్రి వద్ద శనివారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతడి వద్ద 860 గ్రాముల గంజాయి లభ్యమైంది. కాజీపేటకు చెందిన గొర్రె సారంగపాణి ఇరవై రోజుల క్రితం విశాఖపట్నం వెళ్లి వ్యాపారం చేసేందుకు గంజాయి కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ, 21,500 ఉంటుందని పోలీసులు తెలిపారు.

## చెరువుల రక్షణకు వాడ్రాను ఏర్పాటు చేయాలి

### వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్

సుబేదారి, సెప్టెంబరు 15: వరంగల్ ఉమ్మడి జిల్లాలో చెరువులు, కుంటల పరిరక్షణ కోసం వాడ్రాను ఏర్పాటు చేసి, వాటిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని వీసీకే పార్టీ రాష్ట్ర అధ్య క్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం హను మకొండ అదాలత్ జంక్షన్‌లోని అమర వీరులస్థూపం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆందోళన కార్యక్రమంలో ఆయనతో పాటు ప్రజాసంఘాల నేతలు డాక్టర్ తిరునహరి శేషు, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, సాయిని నరేందర్, డాక్టర్ చింతం ప్రవీణ్ లు మాట్లాడారు. భద్రకాళి, వడ్డెపల్లి చెరువులలో కట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని అన్నారు. వరంగల్ జిల్లాను కబ్జాదారుల నుంచి కాపాడాలని, కబ్జాలకు సహకరించిన అధికారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కోండ్ర నర్సింగరావు, డాక్టర్ వెంగళరెడ్డి, తాడిశెట్టి క్రాంతి కుమార్, గాజుల గోవర్ధన్, మల్యాల కృష్ణ, చుంచు రాజేందర్, సింగారపు రవిప్రసాద్, ఊ నర్సయ్య, సాదు కుమారస్వామి, కృష్ణ స్వామి, పరశురాములు, వస్కుల రవీందర్, ఎబ్‌నైజర్, అంకేశ్వరపు రాంచదర్, కన్నాల రవి పాల్గొన్నారు.

## వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

మడికొండ, సెప్టెంబరు 15: ఆర్థిక, సామాజిక, రాజకీయంగా వెనుకబడిన వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బోగి కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మడికొండలో నిర్వహించిన వాల్మీకి బోయ బోగి లింగమూర్తి అధ్యక్షతన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్మీకి బోయల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వల్మీకి బోయ వరంగల్ ఉమ్మడి జిల్లా జేఏసీ ప్రతినిధులు నిగ్గుల వెంకటప్రసాద్, ముచ్చు రాజ్‌కుమార్, దేశెట్టి గోపాల్, వెంకటేష్, బోగి కుమారస్వామి, పెనుకుల సారయ్య, తట్ల రమేష్, బేర్గు సతీష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బోగి కృష్ణమూర్తి

# రావయ్యా.. గణపయ్యా..

- నిమజ్జన వేళ గణపతులకు అపూర్వ స్వాగతం
- నగరంలో మూడు చోట్ల ప్రత్యేక వేదికలు
- విశ్వహిందూ పరిషత్ నేతల వెల్లడి
- ఉత్తమ గణపతులకు బహుమతులు



అత్యుత్తమ బహుమతిని అందుకుంటున్న కాజీపేటలోని టీఎన్జీవోస్ గజానన మండలి నిర్వాహకులు, ద్వితీయ బహుమతి అందుకుంటున్న శ్రీజ హోమ్ బాధ్యులు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 15: నిమజ్జనానికి తరలివచ్చే గణేష్ విగ్రహాలను అపూర్వంగా స్వాగతించేందుకు ఎప్పటిలాగే మూడు ప్రాంతాల్లో ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేస్తున్నట్లు విశ్వ హిందూ పరిషత్ వరంగల్ మహానగర గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ న్యాలకొండ భాస్కర్‌రావు, విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి ఉదయ్‌కుమార్ తెలిపారు. యేటా నిర్వహించే ఉత్తమ గణపతులకు బహుమతుల ప్రదానోత్సవం హనుమకొండ టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆదివారం సాయంత్రం జరిగింది.

శ్రీ చైతన్యానంద మహారాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్తమ గణేష్ మండళ్ల నిర్వాహకులకు జ్ఞాపికలు అంద జేసి దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా న్యాలకొండ భాస్కర్‌రావు మాట్లాడుతూ.. కాజీపేట నుంచి తరలివచ్చే వినాయక విగ్రహాలను నిట్ సమీపంలో.. హనుమకొండ ప్రాంతం నుంచి తరలివచ్చే గణేష్ నిమజ్జన రథాలను హనుమకొండ చౌరస్తాలో.. వరంగల్ ప్రాంత విగ్రహాలకు పోచమ్మమైదాన్ సెంటర్‌లో ప్రత్యేక వేదికలను ఏర్పాట్లు చేసి ఆయా గణేష్ మండళ్ల తొమ్మిదిరోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలను వివరిస్తూ అపూర్వంగా స్వాగతించనున్నట్లు వివరించారు.

ఈసారి ఉత్సవాల్లో ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో మట్టి గణపతులను మండపాలలో నెలకొల్పి పూజలు నిర్వహించి పర్యావరణానికి సహక రించారని తెలిపారు. ఉత్తమ గణేష్‌ల ఎంపిక కోసం ఏడు విభాగాలుగా ఎంపికచేసిన 150 మంది కార్యకర్తలు తమకు సహకరించినట్లు భాస్క ర్‌రావు తమ నివేదికలో పేర్కొన్నారు. ఈ వేడుకల్లో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ప్రముఖులు పాల్గొన్నారు.

### ఉత్తమ గణపతి మండళ్లు ఇవే..

వరంగల్ మహానగర పరిధిలోని అన్ని విగ్రహాలను ప్రత్యక్షంగా పరిశీలించి ఉత్తమ గణపతులను ఎంపిక నిర్వాహకులు ఎంపిక చేశారు. ఈసారి మహానగర పరిధిలో కాజీపేట బాపూజీనగర్ ప్రాంతంలో టీఎన్జీవోస్ కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీశ్రీ గజానన మండలి మండలిని అత్యుత్తమ గణపతి మండలిగా ఎంపిక చేశారు. అదే విధంగా హమారా హిం దుస్థాన్ పేరిట కాజీపేట బాపూజీనగర్‌లో ఏర్పాటు చేసిన మట్టి గణప య్యకు ద్వితీయ బహుమతి ప్రదానం చేశారు. వీటితోపాటు వరంగల్ ఎల్లం బజార్‌లోని భద్రకాళి హిందూ ఉత్సవ సమితి, కాశిబుగ్గ ఓసిటీ గజా ణన మండలి, ఖిలావరంగల్ వినాయక ట్రస్టు భవన్ వాసవీ లైన్, హను మకొండలోని నందిహిల్స్‌లో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక మండలి, అలాగే హనుమకొండ అడ్వకేట్స్ కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీగ జానన మండలి, కేయూ పరిధిలో విజయగణపతి కాలనీలో విజయగణపతి మందిరంలో ఏర్పాటు చేసిన విగ్రహానికి అత్యుత్తమ మండలులుగా ఏర్పాటు చేసి బహుమతులను ప్రదానం చేశారు. కాగా, ప్రథమ బహుమతులుగా వరంగల్ గీతాభవన్‌లోని సిద్ధి విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ, కాశిబుగ్గలోని రాంకీ విల్లాలో ఏర్పాటుచేసిన ఉత్సవ కమిటీ, ఖిలా వరంగల్‌లోని బాల గణేష్ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన మండలి, హనుమకొండ జులైవాడలో శివపార్వతి గజానన మండలి, జీఎంఆర్ బృందావన్ అపార్ట్‌మెంట్‌లో విజయగణపతి నవరాత్రి సమితి, కాజీపేట డీజిల్‌కాలనీలో ఏర్పాటు చేసిన గణపతి యూత్ అసోసి యేషన్ ద్వితీయ బహుమతులుగా వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లోని 14 గణేష్ మండళ్లకు అందించగా, తృతీయ బహుమతులుగా 22 గణేష్ మండళ్లను ఎంపిక చేసి బహుమతులను ప్రదానం చేశారు.

## టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన మంత్రి సురేఖ

వరంగల్ సిటీ, సెప్టెంబరు 15: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్ గౌడ్ ఆదివారం హైదరాబాద్ గాంధీభవన్‌లో పదవీబాధ్యతలు స్వీకరించారు. కాగా, అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మహేష్‌కుమార్ గౌడ్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


టీపీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి కొండా సురేఖ

### మహమ్మద్ ప్రవక్త మాటలు స్ఫూర్తిదాయకం

పవిత్ర హృదయంతో కూడిన ప్రతీ మనిషికి యావత్తు భూమి ప్రార్థనా స్థలమేనని మహమ్మద్ ప్రవక్త మాటలు స్ఫూర్తిదాయకమని మంత్రి కొండా సురేఖ అన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవమైన మిలాద్ ఉన్ నబీ (సోమవారం)ను పురస్కరించుకుని ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహమ్మద్ ప్రవక్త ప్రవచించిన శాంతి, సౌభ్రాతృత్వం, కరుణ, ధార్మిక చింతన, దాతృత్వం, సర్వమానవ సమానం అనే సుగుణాలు మనిషిని ఉత్తమ మార్గంలో నడిపిస్తాయని తెలిపారు.

## ఉపాధ్యాయ సంఘాల్లో చిచ్చుపెడితే ఊరుకునేది లేదు..


సమావేశంలో మాట్లాడుతున్న మన్నె చంద్రయ్య

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15: ఉపాధ్యాయ సంఘాల్లో చిచ్చుపెడితే ఊరుకునేది లేదని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మన్నె చంద్రయ్య హెచ్చరించారు. ఆదివారం కాళోజీ సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా సంఘాన్ని బలోపేతం చేస్తూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. సంఘం ఎన్నికల్లో ఓడిన ఓ వ్యక్తి సంఘంలో చీలికలు తెచ్చి సంఘం నాది అనే ధోరణితో వ్యవహరించడం సరికాదన్నారు. సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ఇటీవలకాలంలో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉపాధ్యాయులను మభ్యపెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తూ తమకు అధికార పార్టీ నాయకుల అండదండలున్నాయని ప్రగల్భాలు పలుకుతున్న వారు వారి పద్ధతిని మార్చుకోవాలన్నారు. పోలీసుల కేసులు పెడతామని బెదిరింపులకు గురిచేస్తే ఎవరు భయపడరన్నారు. సంఘం కోసం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం మాత్రమే పదేళ్లుగా పాటుపడుతున్నామని, రాజకీయాలు చేసేందుకు ఉపాధ్యాయ సంఘంలో పనిచేయడంలేదన్నారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు చెన్నయ్య, అబ్దుల్ పనిచేస్తున్నారని, ఆ సంఘంలోనే తాము పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్య క్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీనివాస్, రమేష్, సంతోష్, రాజు, కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కేయూ కామన్ మెస్‌లో అగ్ని ప్రమాదం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 15: కాకతీయ యూనివర్సిటీలో కామన్ మెస్‌లో ఆదివారం ఉదయం వంటలు చేస్తుండగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మంటలతో ఒక్కసారిగా కామన్ మెస్ సిబ్బంది, విద్యార్థులు ఆందోళనలకు గురయ్యారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో కామన్ మెస్ సిబ్బంది వంట చేస్తుండగా నూనె భారీ గిన్నెలో సలసల కాగడంతో వేడికి ఒక్కసారిగా మంటలు లేచాయి. మంటల్లో కామన్ మెస్‌కు సరఫరా అయ్యే విద్యుత్ వైర్ కాలి బూడిదైయింది. వంట పాత్రలు కాలిపోయాయి. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో భారీ ప్రమాదం తప్పిందని విద్యార్థులు, సిబ్బంది చెప్పారు. ఒకవేళ విద్యుత్ వైర్లు నీళ్లలో పడిఉంటే కామన్ మెస్ భవనానికి షార్ట్ సర్క్యూట్ జరిగి భారీ ప్రమాదం సంభవించే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

విషయం తెలుసుకున్న వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడారు. వర్సిటీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డికి ప్రమాద విషయాన్ని వివరించి విద్యుత్ పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టాలని కోరారు. వర్సిటీ విద్యుత్ సిబ్బంది కామన్‌మెస్‌లో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో విద్యార్థులకు మధ్యాహ్నం లంచ్‌కు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు చేపట్టారు. వర్సిటీ ఇంజనీరింగ్ శివశంకర్, హాస్టల్స్ కేర్ టేకర్ ప్రభాకర్, రాజు తదితరులు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశారు. భారీ ప్రమాదం తప్పటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


ప్రమాదంలో దగ్ధమైన వంటపాత్రలు

### వర్సిటీ కాంట్రాక్టు

## అధ్యాపకులు బెదిరిస్తున్నారు..

### సోషల్ మీడియాలో ఓ దళిత మహిళ ప్రొఫెసర్ ఆవేదన

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 15: కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేతలు తన విధులకు ఆటంకం కలిగిస్తూ, అవమాన పరుస్తున్నారని కేయూ ఆర్ట్స్ డీన్, తెలుగు విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న దళిత మహిళా ప్రొఫెసర్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం సదరు మహిళ ప్రొఫెసర్.. ఆదివారం సోషల్ మీడియా వేదికగా తన ఆవేదనను వ్యక్తపరిచారు. సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తెలుగు కాంట్రాక్టు అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఓ వ్యక్తి.. వర్సిటీ క్యాంపస్‌లోని తెలుగు విభాగానికి బదిలీ చేయాలంటూ ఐదు నెలలుగా తనను తీవ్ర మానసిక వేదనకు గురిచేస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేసింది. మరో ఇద్దరు కాంట్రాక్టు అధ్యాపకులతో కలిసి ఆయన.. తన చాంబర్ తలుపులను కోపంతో తోసుకుంటూ వచ్చి తీవ్ర పదజాలంతో మాట్లాడి తన విధులకు ఆటంకం కలిగించారని ఆవేదన వ్యక్తం చేసింది. కాంట్రాక్టు అధ్యాపకుడైన తనను కాదని, మరో పార్టుటైమ్ అధ్యాపకురాలిని డిపార్టుమెంట్‌కు ఎలా బదిలీపై రప్పిస్తావని ప్రశ్నించారని తెలిపింది. మీకు తెలుగు విభాగాధిపతిగా పనిచేయడం చేతకాదని, రాజీనామా చేయలంటూ మానసికంగా వేధింపులకు గురిచేసినట్లు ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వర్సిటీ ఉన్నతాధికారుల ఆదేశాలు, వర్సిటీ నిబంధనల మేరకు తాను విధులు నిర్వహిస్తున్నానని చెప్పినప్పటికీ వర్సిటీలో కాంట్రాక్టు సంఘం అధ్యక్షుడు, ఇతర కాంట్రాక్టు అధ్యాపకులతో కలిసి తనను ఇబ్బందులకు గురి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అకూట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారిల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

## నీటి పరిరక్షణ ల్యాబ్ ఉద్యోగుల ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఎన్నిక

వడ్డెపల్లి, సెప్టెంబరు 15: మిషన్ భగీరథ నీటి నాణ్యత, పరిశీలన, పరిరక్షణ ల్యాబ్ ఉద్యోగుల ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సర్వసభ్య సమావేశం ఆదివారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ జవహర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో ముఖ్య సలహాదారు కె.ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా అచ్చ రాజేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా పులి రాజేష్ ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు, కె.విద్యావతి, జిల్లా కోశాధికారులుగా జి.సూరజ్, ఎస్.భాగ్య లక్ష్మి, జాయింట్ సెక్రటరీగా యు. కిరణ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా అశోక్, రాధిక, భరత్, యాకయ్య, రాజు, పరశురాములు ఎన్నికయ్యారు.

## రేపు ఏనుమాముల మార్కెట్‌లో యథావిధిగా క్రయవిక్రయాలు

### మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 15: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం మిలాద్ ఉన్ నబీ పండగ సెలవుగా ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సోమవారం వినాయక నిమజ్జనం, మంగళవారం మిలాద్ ఉన్ నబీ పండగ సెల వుగా ప్రకటించడం జరిగింది. కాగా ప్రభుత్వం సోమవారం మిలాద్ ఉన్ నబీ పండగ సెలవుగా ప్రకటించిన నేపథ్యంలో మార్కెట్ మం గళవారం యథావిధిగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి రైతులు తమ సరుకులను విక్రయించడానికి అవకాశం ఉందని ఆ ప్రకటనలో తెలిపారు.

# పశుగణనకు సిద్ధం

- భారత్ పశుగణ యాప్ అందుబాటులోకి రాగానే మొదలు
- సిబ్బందికి శిక్షణ పూర్తి



హనుమకొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) :ఐదేళ్లకోసారి జరిగే జాతీయ పశుగణన చేపట్టేం దుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పశు సంవర్ధక శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకొని సిద్ధంగా ఉన్నారు. వాస్తవంగా ఈ గణన ఈనెల 1వ తేదీ నుంచి ప్రారంభం కావలసి ఉంది. అయితే పశు గణ్ పేరుతో కేంద్రం ఒక యాప్‌ను రూపొందిస్తోంది. ఈ పని ఇంకా పూర్తి కాలేదు. యాప్ అందుబాటులోకి రాగానే పశుగణన మొదలవుతుంది. నాలుగు నెలల పాటు ఈ గణన సాగుతుంది. పశుగణన ఐదేళ్లకోసారి దేశ వ్యాప్తంగా జరుగుతుంది. ఈ గణనలో భాగంగా పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కుక్కలు, కుందేళ్లు, కోళ్ల తదితర లైవ్‌స్టాక్‌ను లెక్కిస్తారు. 2018లో 20వ పశుగణన నిర్వహించారు. 2023లో 21వ గణన జరపాల్సి ఉండగా శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు జరగడంతో ఆలస్యమైంది.

ఈ గణన ద్వారా ప్రభుత్వ పథకాల ద్వారా అవులు, గేదెలు,, గొర్రెలు, మేకలు పొందిన వారి వివరాలతోపాటు కోళ్ల ఫారాలు ఎన్ని ఉన్నాయనే ది కూడా తెలుస్తుంది. మొత్తం మీద గతంతో పోల్చితే పశువుల సంఖ్య ఏ మేర పెరిగింది అనేది స్పష్టమవుతుంది. 2018లో నిర్వహించిన పశు గణన ప్రకారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో 47.04 లక్షల లైవ్ స్టాక్, 61.30 లక్షల కోళ్లు ఉన్నాయి. ఈ సారి ఇవి ఏ మేరకు పెరిగింది? లేదా తగ్గింది.. తాజా పశుగణన ద్వారా తేటతెల్లమవుతుంది. ఉమ్మడి జిల్లాలో పదేళ్లుగా గణనీయంగా తగ్గుతూ వస్తోంది. పశువుల గణన సరైన ప్రణాళిక, పశుసంక్షేమ ప్రణాళిక రూపకల్పనకు ఎంతో దోహదపడుతుంది, ఈ రంగంలో వినూత్న కార్య క్రమాలను అమలుచేయడానికి పశుగణన సమాచారం ఎంతో దోహదపడుతుంది.

### తగ్గుతున్న కుందేళ్లు

2018 గణన ప్రకారం ఉమ్మడి జిల్లాలో కుందేళ్లు పదివేలకు మించి లేవు. కుందేళ్లను వేటాడడం, వాటి పెంపకాన్ని పెద్దగా చేపట్టకపోవడం తదితర కారణాల వల్ల వాటి సంఖ్య ఐదేళ్లలో గణనీయంగా తగ్గిపోయి ఉండవచ్చునని పశు సంవర్ధక శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. పందుల సంఖ్య కూడా చాలా వరకు తగ్గిపోయింది. వ్యాధులకు కారణమవుతున్న పందుల పెంపకాన్ని ప్రభుత్వం ఏ మాత్రం ప్రోత్సహించడం లేదు. సీమ పందుల పెంపకం మాత్రం కొంత మేరకు కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలో గాడిదల సంఖ్య కూడా పూర్తిగా తగ్గిపో యింది. ఇప్పుడు ఎక్కడా గాడిదలు కనిపించడం లేదు. గతంలో రజకులు గాడిదలను పెంచి పోషించేవారు. బట్టలను ఉతికేందుకు చాకిరేవుల వరకు బట్టల మూటలను తీసుకువెళ్లేందుకు వాటిని ఉపయోగించేవారు. ఇప్పుడు చాకి రేవులు తగ్గిపోయాయి. దానితో గాడిదల పోషణ కూడా తగ్గింది.

### ఎన్యుమరేటర్లకు శిక్షణ

ఉమ్మడి జిల్లాలో పశుగణన నిర్వహించేందుకు 180మంది పశు వైద్యులను పర్యవేక్షకులుగా, 101 మంది పశు సంవర్ధక శాఖకు చెందిన వారిని ఎన్యుమరేటర్లుగా ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. వీరికి జిల్లా స్థాయిలో నోడల్ అధికారి ఉంటారు. ప్రతీ 1500 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్‌ను కేటాయిస్తారు. పశు జాతులను ఎలా గుర్తించాలి, యాప్‌ను ఎలా వినియోగించాలి, సేకరించిన సమాచారాన్ని ఎలా అప్‌లోడ్ చేయాలి అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. గణన చేపట్టేవారు మొత్తం 71 కాలమ్స్‌లో పశువులకు సంబంధించి న వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. గతంలో మ్యానువల్ పద్ధతిలో గణన జరగగా దేశంలో మొదటిసారిగా డిజిటల్ పశుగణనను చేపడుతున్నారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి ఆవులు, గేదెలు, కోళ్లు, మేకలు, గొర్రెలు, కుక్కలు, ఇతర పశవుల వివరాలను రైతులు, పశు పోషకులను అడిగి నమోదు చేసుకుంటారు. రైతుల వద్ద వ్యవసాయ పరికరాలు ఎన్ని, ఏవేవి ఉన్నాయనేది కూడా నమోదు చేస్తారు. ఈ సారి ప్రత్యేక యాప్‌ద్వారా పశుగణన నిర్వహిస్తున్న క్రమంలో ప్రతీ పశువుకు ఒక డిజిటల్ నెంబర్‌ను ఇచ్చి అందులో యజమానితో పాటు పశువు వివరాలను పొందుపరుస్తారు. పశువులను అమ్మినా, కొనుగోలు చేసినా వెంటనే వివరాలు తెలిసే విధంగా సాఫ్ట్‌వేర్ ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే అడవుల్లో జీవించే వన్యప్రాణుల గణనను అటవీ శాఖ అధికారులు పూర్తి చేశారు.

### ఉమ్మడి జిల్లాలో పశు సంపద

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2018లో నిర్వహిం చిన జాతీయ పశుగణన ప్రకారం పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు కుక్కలు కలుపుకొని మొత్తం 47.04 లక్షల లైవ్‌స్టాక్ ఉం ది. కోళ్లు 61.30 లక్షలు ఉన్నాయి. వరంగల్ జిల్లాలో మొత్తం లైవ్‌స్టాక్ 10.56 లక్షలు ఉంది. ఇందులో 81వేలు పశువులు, 1.11 లక్షలు గేదెలు, 6.12 లక్షలు గొర్రెలు, 97వేలు గొర్రెలు, 8వేల పందులు, ఉన్నాయి. కాగా 3వేల కుక్కలు, 19.17 లక్షల కోళ్లు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో 5.56 లక్షల పశు సంపద ఉంది. ఇందు లో 49వేల పశువులు, 76వేల గేదెలు, 5.08 లక్షల గొర్రెలు, 62వేల, మేకలు, 9వేల పందులు, ఉన్నాయి. కాగా 7వేల పందులు, 21.68 లక్షల కోళ్ళు ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా లో మొత్తం పశు సంపద 5.06 లక్షలు. ఇందు లో 69వేల పశువులు, 63వేల గేదెలు, 2.92 లక్షల గొర్రెలు, 81వేల మేకలు, వెయ్యి పందులు ఉన్నాయి. కాగా కుక్కలు 2వేలు, కోళ్ళు 4.22 లక్షలు ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 11.75 లక్షల పశు సంపద ఉంది. ఇం దులో 1.82 లక్షల పశువులు, 1.30 లక్షల గేదెలు, 6.78 లక్షల గొర్రెలు, 1.78 లక్షల మేకలు, 8 వేల పందులుఉండగా, కుక్కలు 11వేలు, కోళ్లు 11.09 లక్షలు ఉన్నాయి. ఉన్నాయి. ములుగు జిల్లాలో మొత్తం 3.65 లక్షల పశు సంపద ఉంది. వీటిలో 99వేల పశువులు, 61వేలే గేదెలు, 1.29 లక్షల గొర్రెలు, 75వేల మేకలు ఉండగా 4వేల కుక్కలు, 5.14 లక్షల కోళ్లు ఉన్నాయి. జనగామ జిల్లాలో మొత్తం 10.46 లక్షల లైవ్‌స్టాక్ ఉంది. ఇందులో 1.02 లక్షల పశువులు, 1.20 లక్షల గేదెలు, 8.01 లక్షల గొర్రెలు, 1.83 లక్షల మేకలు, 3వేల పందులు ఉండగా కుక్కలు 2వేలు, కోళ్లు 7.25 లక్షల కోళ్లు ఉన్నాయి.

## అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి

**రజక సంఘం జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల శంకర్**



సమావేశంలో మాట్లాడుతున్న రజక సంఘం నేత శంకర్

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 15: వెంకటాపూర్(రామప్ప) పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెరుకపల్లిలో మహిళపై అత్యాచారం చేసిన నిందితుడు మాదం శివకుమార్‌ను కఠినంగా శిక్షించాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం ములుగులో జరిగిన రజక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం నాయకులు నగరపు రమేష్, బండి మధు, గుమ్మడెల్లి లక్ష్మణ్, గూడెల్లి ఓదెలు, నాంపల్లి స్వామి, వైనాల సదానందం, పైడిపల్లి కుమార్, కొంరాజు వెంకన్న, కాశిరాజు రమేష్, బొడ్డుపల్లి శ్రీకాంత్, వైనాల నరేష్, పావురాల భిక్షపతి, కల్లెపల్లి ప్రవీణ్, ఎన్నిండ్ల సృజన్, రాదండి స్వామి, ఇల్లందుల లెనిన్, ముష్కి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ఐటీడీఏ ముట్టడిని విజయవంతం చేయాలి

**ఏఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్**

ఏటూరునాగారం, సెప్టెంబరు 15: ఈనెల 17న చేపట్టనున్న ఐటీడీఏ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ), ఆదివాసీ విద్యార్థి సంఘం (ఏఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు దబ్బకట్ల శ్రీకాంత్ కోరారు. మండల కేంద్రంలో తుడుందెబ్బ సంఘ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ చెంతనే ఉన్న గిరిజనుల అభివృద్ధికి ఆమడ దూరంలో మగ్గుతున్నారన్నారు. ప్రధానంగా విద్యా హక్కుల చట్టం అమలు చేయాలని, లాంగ్ స్టాండింగ్‌లో ఉన్న అధికారులను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ టీడబ్ల్యూజీపీ పాఠశాలల అభివృద్ధి చేయాలని, ప్రతి గొత్తికోయగూడెంలో పాఠశాలలు సక్రమంగా నడిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రైబల్ డీఎస్సీని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల, ఉద్యోగుల పదోన్నతులు, బదిలీల సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17న తుడుందెబ్బ, ఏఎస్‌యూ, ఏఎంఎస్, ఏటీఎఫ్, ఏఎన్ఎస్, ఆదివాసీ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో చలో ఏటూరునాగారం కార్యక్రమాన్ని చేపట్టినట్లు శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు కోర్సబెల్లి గణేష్, విద్యార్థి సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాయం పూర్ణ, చందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్

### ఐఎన్‌టీయూసీలో

## ఆటో డ్రైవర్ల చేరిక

వాజేడు, సెప్టెంబరు 15: కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీలో ఆదివారం ఆటోడ్రైవర్లు చేరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ సమక్షంలో 50 మందికి పైగా ఆటోడ్రైవర్లు ఐఎన్‌టీయూసీలో చేరుతున్నట్లు తెలిపారు. అలాగే ఆటోడ్రైవర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి లేగల ప్రవీణ్ ఆటో డ్రైవర్ల యూనియన్ మండల అధ్యక్షుడిగా జిమిడ చిరంజీవిని నియమించారు. కార్యదర్శిగా ఇల్లెందుల వేణు, ఉపాధ్యక్షుడిగా కుప్పు సారయ్య, కోశాధికారి కోగిల రాజు, సభ్యులుగా నాగరాజు, మడప విజయ్, జనగం కేశవరావు, విశ్వనాథ్, కోర్సా అశోక్, నరేష్, సరబాబు, జ్యోతిబాబు, చందు, మహేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విక్రాంత్ వర్మ మాట్లాడుతూ ప్రభుత్వం ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు.

# విఘ్నేశ్వరుడి నిమజ్జనోత్సవానికి పటిష్ఠ భద్రత

- విధుల్లో పాల్గొననున్న 300 మంది పోలీసులు
- ఎస్పీ నేతృత్వంలో భారీ బందోబస్తు
- అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చర్యలు



కాళేశ్వరంలోని నిమజ్జన ప్రదేశాన్ని కలెక్టర్‌తో కలిసి పరిశీలిస్తున్న ఎస్పీ (ఫైల్)

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబరు 15: జిల్లాలో గణేష్ నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించడంపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. పటిష్ఠ భద్రత నడుమ ఈ వేడుక జరిగేలా చర్యలు చేపడుతోంది. ఎస్పీ కిరణ్‌ఖరే నేతృత్వంలో ఒక అదనపు ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, 8 మంది సీఐలు, 18 మంది ఎస్సైలతో పాటు 270 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తులో పాల్గొనున్నారు. ఈ విధులపై ఇప్పటికే ఎస్పీ దిశానిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా 12 మండలాల్లో 900 విగ్రహాలు కొలువుదీరినట్లు అధికారులు గుర్తించారు. ఇవి అధికారిక లెక్కలు కాగా వీటితో పాటు జిల్లా వ్యాప్తంగా సుమారు 1,400 విగ్రహాలు ఉండొచ్చని భావిస్తున్నారు. విగ్రహాలన్నీ సోమ వారమే నిమజ్జనం కానున్నాయి. ఇందుకు అనువుగా కాళేశ్వరంలో రెండు క్రేన్లను ఏర్పాటు చేయనున్నారు. శోభయాత్రల సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు శాఖ పటిష్ఠ చర్యలు చేపడుతోంది.

### మద్యం దుకాణాల బంద్

వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకొని మద్యం దుకాణాలను మూసివేయాలని సర్కారు ఆదేశించింది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న మద్యం షాపులు 24 గంటలపాటు మూత పడనున్నాయి. సోమవారం ఉదయం నుంచి మళ్లీ మంగళవారం ఉదయం వరకు బంద్ చేయిస్తున్నట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

### పోలీసుల సూచనలివే..

నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పలు సూచనలను చేశారు. మండపాల నిర్వాహకులందరూ తమ విగ్రహాలను త్వరగా తీసి బయల్దేరే ప్రయత్నం చేయాలని అంటున్నారు త్వరితగతిన నిమజ్జనం పూర్తి చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈ విషయంలో పోలీసు సిబ్బందికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేస్తు న్నారు. నిమజ్జనానికి వెళ్లే సమయంలో శోభాయాత్రలో డీజే మోగించడం గానీ, టపాసులు కాల్చడానికి గానీ అనుమతి లేదంటున్నారు. నిమజ్జనానికి ఉపయోగించే వాహనాన్ని నడిపే డ్రైవర్ మద్యం సేవించకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. వాహనాన్ని రోడ్డుపైన వదిలిపెట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లకూడదంటున్నారు. నిమజ్జనం సమయంలో వచ్చేదారిలో వాహనాలన్నీ క్యూలైన్ పాటించాలని సూచిస్తున్నారు. ఒక వాహనాన్ని మరో వాహనం ఓవర్‌టేక్ చేయొద్దంటున్నారు. చెరువులు, వాగులు, నదుల వద్ద ఎవరూ నీళ్లలోకి వెళ్లకూడదని పేర్కొన్నారు. భక్తులు తమ ఆభరణాలను గానీ, పెద్ద మొత్తంలో డబ్బులు గానీ నిమజ్జనం వద్దకు తీసుకెళ్లొద్దని అంటున్నారు. చైన్ స్నాచింగ్, పిక్‌పాకెటింగ్‌కు తావు లేకుండా జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

**ప్రతి ఒక్కరూ సహకరించాలి**

ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. నిర్వాహకులు పోలీసుల సలహాలు తప్పక పాటించాలి. వీలైనంత త్వరగా నిమజ్జనానికి బయల్దేరారు. మద్యం సేవించి హంగామా చేస్తే చర్యలు తప్పవు. భక్తిశ్రద్ధలతో గణనాథుడి శోభాయాత్రను జరుపుకోవాలి. ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసుల ప్రత్యేక బందోబస్తు ఉంటుంది.

- కిరణ్‌ఖరే, భూపాలపల్లి ఎస్పీ



## వడ్డీ కింద వేధింపులు!

- పేదలకు అప్పులు ఇచ్చి.. అఘాయిత్యాలు
- అత్యాచార నిందితుడిపై గతంలో నాలుగు కేసులు

ములుగు, సెప్టెంబరు 15: పేద కుటుంబాల ఆర్థిక అవసరాన్ని అవకాశంగా మలుచుకుంటున్న ఆ యువకుడు అధిక వడ్డీలు వసూలు చేయడమే కాకుండా వేధింపులకు గురిచేస్తున్నాడు. ఆ ఇంటి యువతులు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఈక్రమంలో 60 ఏళ్ల మహిళపై లైంగికదాడికి పాల్పడటంతో అతడి క్రైమ్ రికార్డు వెలుగులోకి వచ్చింది. దీంతో ఊరు ఊరంతా ఒక్కటై నిందితుడికి కఠిన శిక్ష విధించాలని పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... ములుగు జిల్లా వెంకటాపూర్(రామప్ప) పోలీస్‌స్టేషన్ పరిధి పెర్కపల్లికి చెందిన మాదం చిన్నకొమురయ్య గ్రామంతోపాటు చుట్టుపక్కల ఊళ్లలో వడ్డీ వ్యాపారం చేస్తున్నాడు. అసలు, వడ్డీ డబ్బులు వసూలు చేసే క్రమంలో అతడి కుమారుడు శివకుమార్ అరాచకాలకు పాల్పడుతున్నట్లు బాధితులు, గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అతడిపై గతంలో నాలుగు కేసులు నమోదయ్యాయి. తాజాగా 60 ఏళ్ల మహిళపై ఆ యువకుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు అతడిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. అంతకుముందే ఓ తీర్మానం చేసుకున్నారు. చిన్న కొమురయ్యతో పాటు అతడి కుమారులు శివకుమార్, కుమార్‌ల అరాచకాలతో కొన్ని కుటుంబాలు ఊరు వదిలి వెళ్లిపోవాల్సిన పరిస్థితి వచ్చిందని, ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు. గ్రామస్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఆ కుటుంబ సభ్యులతో ఎవరూ మాట్లాడకూడదని, పనికి కూడా వెళ్లొద్దని, ఎవరైనా అతిక్రమిస్తే రూ.50వేల జరిమానా విధిస్తామని తీర్మానించారు. అంతేకాకుండా పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన కార్యక్రమానికి రాకుంటే రూ.5వేల జరిమానా కట్టాలని పేర్కొన్నారు. దీంతో ఇంటికొకరు చొప్పున వచ్చి స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. ఈవిషయమై పోలీసులను సంప్రదించగా గతంలో శివకుమార్‌పై నాలుగు కేసులు నమోదైనట్లు వెల్లడించారు. 2022లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువతిని వేధించినందుకు కేసు నమోదైంది. పెర్కపల్లిలో ఓ కుటుంబంపై దౌర్జన్యానికి పాల్పడినందుకు 2020లో, ఇదే గ్రామానికి చెందిన వ్యక్తిని బెదిరించినందుకు 2022లో, వెంకటాపూర్ మండలం ఎల్లారెడ్డిపల్లిలో ఓ ఇంటి పైకప్పును ధ్వంసం చేసినందుకు 2023లో కేసులు నమోదైనట్లు తెలిపారు.

## ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలి

**ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ**



వినాయక మండపం వద్ద నిర్వాహకులతో మాట్లాడుతున్న ఏఎస్పీ

ఏటూరునాగారం, సెప్టెంబరు 15: ప్రజలు పండుగలు, పర్వదినాలు తదితర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. గణేష్ నిమజ్జనంతోపాటు మిలాదున్నబీ వేడుకలు సోమవారం ఒకేరోజు రావడంతో హిందువులు, ముస్లింలకు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం సాయంత్రం ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై ఎస్.కె. తాజుద్దీన్‌తో కలిసి ముందుగా మండల కేంద్రంలోని మసీదును ఏఎస్పీ సందర్శించారు. మత గురువు అబ్దుర్రహ్మాన్‌ను కలిసి మిలాదున్నబీ వేడుకలను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలోని వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన మండపాలను ఏఎస్పీ సందర్శించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## పాలిటెక్నిక్ హాస్టల్‌లో సౌకర్యాలు కరువు

కాటారం, సెప్టెంబరు 15: మండలంలోని కొత్తపల్లి శివారులోగల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వసతిగృహం విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు. విద్యార్థుల సమస్యలపై పలువురు ఆదివారం 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తీసుకువచ్చారు. రూ.3 కోట్ల నిధులతో నిర్మించిన భవనం ఆలనాపాలన సరిగా లేకపోవడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. స్వీపర్, స్కావెంజర్ లేక గదులు, వరండాలు, టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. విద్యార్థులు తమ గదులను ఊడ్చుకుంటున్నామని వెల్లడించారు. మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని, ఒక్కోసారి నీళ్లలాంటి పప్పుతో అన్నం తినలేని పరిస్థితి ఉందని పలువురు విద్యార్థులు వాపోయారు. హాస్టల్‌లో సరైన పర్యవేక్షణ లేక ఇబ్బందిగా మారింది. సిబ్బంది ఇళ్లలోకి వెళ్లడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కోట్లాది రూపాయల నిధులతో నిర్మించిన హాస్టల్‌లో 60 మందికి పైగా విద్యార్థులుండగా సరిపడా సిబ్బంది, పర్యవేక్షణ లేక విద్యార్థులు నానా తంటాలు పడుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## బీమా.. ధీమా

3వ పేజీ తరువాయి

ఎవరైనా మరణిస్తే వడ్డీతో కలిపి కుటుంబ సభ్యులు చెల్లించాల్సి వచ్చేది. లేదంటే ఆ ప్రభావం గ్రూపు సభ్యులపై పడేది. ప్రస్తుతం పొదుపు మహిళలకు ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణబీమా వర్తింప జేస్తోంది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి పథకాల ద్వారా రుణం పొందిన మహిళ చనిపోతే ఆమె కట్టాల్సిన మొత్తాన్ని ప్రభుత్వం మాఫీ చేయనుంది.

### అవగాహన అవసరం

ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈరెండు పథకాల్లో అర్హత సాధించాలంటే తప్పనిసరిగా అన్నిగ్రూపుల వారు నెలవారీ సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. వాటికి సంబంధించిన వివరాలు మినిట్స్ పుస్తకంలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. పొదుపు రుణం క్రమం తప్పకుండా చెల్లిస్తూ ఉండాలి. వీటి వివరాలు ఉండాలి. అయితే.. ఇలాంటి అంశాలపై మహిళల్లో అవగాహన కరువైంది. దీనిపై సెర్ప్, మెప్మా అధికారులు దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

### నిమజ్జనోత్సవానికి

## అధికారులకు ప్రత్యేక విధులు

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 15: గణేష్ నిమజ్జనం జిల్లాలో ప్రశాంతంగా జరిగేందుకు కలెక్టర్ రాహుల్‌శర్మ పటిష్ఠ చర్యలు చేపట్టారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వివిధ శాఖల అధికారులకు ప్రత్యేక విధులు కేటాయించారు.

- భూపాలపల్లి, కాటారం డీఎస్పీలు : పోలీసు బందోబస్త్, ట్రాఫిక్, ఇసుక లారీల నియంత్రణ
- జిల్లా పంచాయితీ అధికారి : నిమజ్జన ప్రాంతాల్లో లైటింగ్, సౌండ్ ఏర్పాట్లు, శానిటేషన్, తాగునీటి సౌకర్యం
- జిల్లా ఫైర్ ఆఫీసర్ : వినాయకుల నిమజ్జనం
- ఎక్సైజ్ సూపరిటెండెంట్ : నిమజ్జనం రోజు జిల్లాలో మద్యం షాపుల మూసివేత
- జిల్లా మత్స్యశాఖ అధికారి: నిమజ్జన ప్రాంతాల్లో గజ ఈతగాళ్ల ఏర్పాటు
- జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి : నిమజ్జనప్రాంతాల్లో అంబులెన్స్‌ల ఏర్పాటు, మెడికల్ టీంలను సిద్ధం చేయడం
- టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ: ఈనెల 16,17 తేదీల్లో నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా
- ఆర్అండ్‌బీ, పీఆర్ ఈఈలు: వాహనాలు ఆటంకం కలగకుండా చర్యలు
- డివిజన్ పంచాయతీ అధికారి: వినాయ విగ్రహాలకు వాహనాలకు టోకెన్ ఇచ్చి, నిమజ్జన ప్రాంతాలను కేటాయించడం
- ఇరిగేషన్ శాఖ ఈఈ: నిమజ్జనం ఏరియాల్లో పరిస్థితిని సమీక్షించడంతో పాటు, విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు లేబర్స్‌ను సమకూర్చుకోవడం
- కాళేశ్వరం ఆలయ ఈవో: వినాయక నిమజ్జన విధుల్లో పాల్గొనే వీవీఐపీలు, వీఐపీలు, ఇతర అధికారులకు వసతి కల్పించడం.

## జీపీ సిబ్బంది అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

వాజేడు, సెప్టెంబరు 15: మండలంలోని అన్ని జీపీల సిబ్బంది ఆదివారం మండల కేంద్రంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జీపీ సిబ్బంది అధ్యక్షుడిగా కంబాలపల్లి కొండయ్య, కార్యదర్శిగా బలుసుపాటి రాములు, ఉపాధ్యక్షుడిగా బొగ్గం బాబు, కోశాధికారిగా దామరకుంట రాంబాబు, మండల ఇన్‌చార్జిగా తొర్రెం శ్రీనును జిల్లా కమిటీ సభ్యుడు పొదిల సత్యనారాయణ నియమించారు. జీపీ సిబ్బంది తమ సమస్యల పరిష్కారానికి పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు.

## గౌరారం చెరువులోనే నిమజ్జనం చేయాలి

గోవిందరావుపేట, సెప్టెంబరు 15: మండలంలోని అన్ని గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు గణేష్ విగ్రహాలను మండలంలోని చల్వాయి గ్రామంలోని గౌరారం చెరువులోనే నిమజ్జనం చేయాలని ఎస్సై కమలాకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లక్నవరం, గుండ్లవాగు, రంగాపూర్ చెరువుల్లో నిమజ్జనానికి అనుమతి లేదని పేర్కొన్నారు. నిమజ్జనం సందర్భంగా లౌడ్ స్పీకర్లు, డీజేలు పెట్టొద్దని సూచించారు.

## రేషన్ బియ్యం పట్టివేత

మహాముత్తారం, సెప్టెంబరు15: మండలంలోని మీనాజీపేట గ్రామంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని ఆదివారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు గ్రామానికి చెందిన మంకుర్తి సారయ్య ఇంట్లో నిల్వ చేసిన 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆర్ఐ భాస్కర్ తెలిపారు. స్వాధీనం చేసుకొన్న బియ్యాన్ని స్థానిక రేషన్ డీలర్ స్వప్నకు అప్పగించినట్లు తెలిపారు.

## రైతు కుటుంబాలను ఆదుకోవాలి

గణపురం, సెప్టెంబరు 15: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనర్ కర్నాటకపు సమ్మయ్య డిమాండ్ చేశారు. ఇటీవల మండలంలోని గాంధీనగర్‌కి చెందిన బీనవేని సురేష్ అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో వారి కుటుంబానికి రూ. 40వేల విలువ గల పాడిగేదెను వారి కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ 194జీవో ద్వారా ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలని తెలిపారు. సంఘం రాష్ట్ర నాయకుడు కొండల్‌రెడ్డి, ఐలయ్య, కో కన్వీనర్ చల్లగురుగుల సంజీవ్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

## పైప్‌లైన్ లీకేజీ.. వృథాగా పోతున్న నీరు



కేటీపీపీ పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పోతున్న నీరు

కాటారం, సెప్టెంబరు 15: మండల కేంద్రంలో 353(సీ)జాతీయ రహదారి పక్కన చెల్పూరు కేటీపీపీకి కాళేశ్వరం గోదావరి నది నుంచి నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ లీకేజీతో నీరంతా వృథాగా పోతోంది. పైప్‌లైన్ లీకేజీతో రోడ్డు పైకి భారీగా నీరు చేరుతుంది. కొందరు డ్రైనేజీ పైన సిమెంట్ కప్పును పగులగొట్టి అందులోకి వెళ్లేలా చేశారు. అయినా నీరు భారీగా రోడ్డుపై ప్రవహిస్తున్నది. చాలా రోజుల నుంచి పైప్‌లైన్ లీకై కొద్దిగా నీరు బయటికి వచ్చేదని, ప్రస్తుతం భారీగా నీరు వృథా అవుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

## జోరుగా బీజేపీ సభ్యత్వ నమోదు

కాటారం, సెప్టెంబరు 15: మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతున్నది. ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు వ్యాపార, వాణిజ్య దుకాణాల యజమానులు, ప్రజలను కలిసి మోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. మండలంలో 4 వేల సభ్యత్వాలు నమోదు చేయడానికి సంకల్పించినట్లు నాయకులు వెల్లడించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూసాల రాజేంద్రప్రసాద్, ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు దుర్గం తిరుపతి, ఓబీసీ మోర్చా మండల అధ్య క్షుడు జిల్లెల్ల శ్రీశైలం, నాయకులు బొంతల రవీందర్, కొండ రాము తదితరులు ఉన్నారు.

## బీమా నిర్ణయంపై బీజేపీ హర్షం

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబరు 15: దేశవ్యాప్తంగా ఉన్న 70సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఆయుష్మాన్ భారత్ పథకం వర్తించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సాధనపల్లి విజయ్ అన్నారు. ఆదివారం మండలంలోని వెంగళరావుపేట గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు మట్టి రమేష్, కోగిల శ్రీను, రామెళ్ల రాజు, చిట్టెం ఈశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సరస్వతి, కుంకుమ పూజలు



పూజలో పాల్గొన్న మహిళలు

కాటారం, సెప్టెంబరు 15: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో నెలకొల్పిన వినాయక మండపాల వద్ద మహిళలు, భక్తులు ఆదివారం సరస్వతి, కుంకుమ పూజలు, అన్నప్రసాద వితరణ చేశారు. మండల కేంద్రంలోని కాటారం, ఆదర్శనగర్, లక్ష్మీదేవర ఆలయం, ఎర్రగుంటపల్లి మండపాల వద్ద పూజలు నిర్వహించారు. ఎర్రగుంటపల్లిలో వేదపండితుడు నాగరాజుశర్మ విద్యార్థులతో సరస్వతి పూజలు చేయించారు. పలువురు దాతలు భక్తులు, పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో కుల సంఘాల పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## 'చేయూత' ఆధ్వర్యంలో శ్రమదానం

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబరు 15: మండలంలోని నూగూరు గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, పల్లె దవాఖాన ఆవరణలో చేయూత ఫౌండేషన్ సభ్యులు ఆదివారం శ్రమదానం చేశారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, పల్లె దవాఖాన ఆవరణల్లోని చెత్తాచెదారాన్ని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సాయిప్రకాష్, అనపర్తి సర్వేశ్వర్‌రావు, ఇండ్ల శ్రీనివాస్, కుర్సం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించాలి

ఏటూరునాగారం, సెప్టెంబరు 15: వినాయక నిమజ్జనంలో నిబంధనలను అతిక్రమించొద్దని సీఐ అనుముల శ్రీనివాస్ అన్నారు. ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం మండలాల వినాయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాలతో ఆయన ఆదివారం సమావేశమయ్యారు. నేడు నిర్వహించనున్న గణేష్ నిమజ్జనంలో పాటించాల్సిన నిబంధనలపై చర్చించారు. ఊరేగింపులో మద్యం సేవించొద్దన్నారు. డీజే ఏర్పాటుకు అనుమతిలేదన్నారు.